ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 13 సెప్టెంబరు 2024



హాజరని చెప్పి తీర్మానాలపై సంతకాలు తీసుకోవడంపై చర్చిస్తున్న సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిలు

# ధీమాలేని బీమా



- అందని ద్రాక్షగా వాతావరణ ఆధారిత బీమా
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అంతులేని నిర్లక్ష్యం
- పరిహారం అంశంలో దగాకు గురౌతున్న అన్నదాతలు
- అమలుపై పట్టీపట్టనట్లుగా వ్యవసాయ, ప్లానింగ్ శాఖలు
- వర్షపాతం ఆధారంగానే పరిహారమని రైతుల ప్రయోజనాలకు గండి

**వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి, తేమ ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు తరచూ నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడిన పంటలు కోల్పోతున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా అప్పుల పాలవుతున్న రైతులు చివరకు ఆయువు తీసుకుంటున్నారు. అన్నదాతలకు ఆర్థిక నష్టాలు, కష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకం ప్రవేశపెట్టింది. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో అందని ద్రాక్షగానే మారింది. రూ.వేలల్లో పెట్టుబడులు వర్షార్పణం అవుతుంటాయి. ఆ నష్టాల నుంచి కోలుకోవడం రైతులకు గగనంగా మారుతోంది. వాతావరణ ఆధారిత బీమా పథకం ద్వారా బాధిత రైతులకు పరిహారం అందించే విషయంలో అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. రైతులకు ఈ పథకంపై అవగాహన కల్పించి, నమోదు చేయించాల్సిన వ్యవసాయ, ఉద్యాన, ప్లానింగ్ శాఖలు అంతులేని నిర్లక్ష్యంతో ఉన్నాయి. దీంతో రైతులు పంటలు కోల్పోతున్నా బీమా పరిహారం అందుకోలేకపోతున్నారు. అధిక వర్షాల వలన పంటలను కోల్పోయిన రైతులకు బీమా అందుకునే అవకాశం ఉన్నా ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.**

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ నెలలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అతి భారీవర్షాలు కురిశాయి. వేల ఎకరాల్లోని పంటలు ముంపునకు గురయ్యాయి. ఇలాంటి పరిణామాలు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో ఏటా జరగడం సర్వసాధారణంగా మారుతుంటోంది. అయినా వాతావరణ ఆధారిత బీమా పథకం అందని ద్రాక్ష చందాన మారింది. నిబంధనల ప్రకారం ఖచ్చితంగా రైతులకు పరిహారం అందే అవకాశం ఉంది. అయితే పంటలు కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా వాతావరణ ఆధారిత బీమా పరిహారం అందించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు శూన్యం. సాధారణ పంటల బీమాకు, వాతావరణ ఆధారిత బీమాకు పూర్తిగా వ్యత్యాసం ఉంది. సాధారణ పంటల బీమా అమలులో సాగు చేసిన పంటలో 33 శాతం పూర్తిగా పంట దెబ్బతింటేనే పరిహారం చెల్లిస్తారు. వాతావరణ ఆధారిత బీమా పథకం అలా ఉండదు. పంట వేసిన సమయంలో అధిక వర్షాలు కురిస్తే జరిగే నష్టాన్ని అంచనా వేస్తారు. ఇలా పంట వివిధ దశల్లో అధిక వర్షాలు, వర్షాభావం వల్ల కలిగే నష్టాన్ని నమోదు చేయాలి. ఈ పరిస్థితుల్లో వాతావరణ బీమా పథకం అమలు కాకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులు వెల్లడించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. పథకం లక్ష్యాలు ఘనంగా ఉన్నా పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం అందిన దాఖలాలు ఇప్పటి వరకు లేవు. గత ఏడాది తీవ్ర వర్షాభావం.. భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పత్తి, మిరప పంటలను వాతావరణ ఆధారిత బీమా పథకంలో చేర్చారు. సదరు రైతులు సాగు చేసిన పత్తి, మిరప పంటలకు వాతావరణ బీమా అమలు అవుతోంది. ఆయా పంటలకు ప్రభుత్వమే రైతుల తరపున ప్రీమియం చెల్లిస్తోంది. వాతావరణ ఆధారిత బీమాలో బీమా ప్రీమియం చెల్లించే ప్రతి రైతు అర్హుడే. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా కలిగే పంట నష్టాలకు బీమా వర్తిస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటే పరిహారం చెల్లిస్తారు.

**సాధారణంకన్నా అధిక వర్షపాతం**

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో గత నెల 31, ఈ నెల 1 తేదీల్లో సాధారణ వర్షపాతం 680.76 మీమీ కాగా 15,764.1 మీమీ నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అంటే సాధారణం కన్నా వెయ్యింతల అధిక వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షాలు రైతులను కోలుకోలేని విధంగా నష్టపరిచాయి. మిరప, వరి, పత్తి, కంది పంటలకు అపార నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ తరుణంలో రైతులకు వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పరిహారం అందించాలి. రైతులకు సదరు పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంలో ఉద్యాన, ప్లానింగ్ శాఖలు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. కుండపోత వర్షాలకు ఈ సారి కూడా వేలాది ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నా బాధిత రైతులకు బీమా ధీమా ఇచ్చే పరిస్థితులు కానరావడంలేదు. దీంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల వల్ల ఆయా పంటలకు జరిగిన నష్టానికి ఈ బీమా పథకం కింద పరిహారం అందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు లేవనే చెప్పాలి. 33 శాతానికిపైగా దెబ్బతిన్న పంటలకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు. 31, 1 తేదీల్లో సాధారణం కన్నా వేల రెట్లు అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. అధిక వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. పత్తి తొలికాపు దశలో అధిక వర్షాలు కురిశాయి. దీనివల్ల దిగు బడులను కోల్పోయారు. నీటిలో నాని ఉరకెత్తి మొక్కలు ఎండిపోయి ఎకరా కు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు దిగుబడులను రైతులు కోల్పోయారు. ఇలా జరిగిన పంట నష్టం వాతావరణ ఆధారిత బీమా కిందకు వస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికలు ఆధారంగా, పంట నష్టపరిహారం కోసం వ్యవసాయ శాఖ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. వ్యవసాయ స్పందించి రైతులకు మేలు చేసేందుకు కృషి చేయాలి. పల్నాడు జిల్లా పరిధిలోని 17 మండలాల్లో 23,317.5 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. 123 గ్రామాల పరిధిలో 9,006 మంది రైతులు నష్టపోయినట్లుగా గుర్తించారు. తుది నివేదికలో 21,212.5 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. అయితే 33 శాతం నష్టం 6,930 ఎకరాల్లో వాటిల్లిందని 3,253 మంది రైతులు నష్టపోయినట్లు మాత్రమే నిర్ధారించారు. అయితే 9,006 రైతులందరికీ వాతావరణ ఆధారిత బీమా పరిహారం వచ్చే అవకాశం ఉన్నా వ్యవసాయ, ప్లానింగ్ శాఖలు స్పందిస్తున్న దాఖలాలు లేవు.

# హాజరని చెప్పి.. తీర్మానాలపై సంతకాలు

- తోటి ఉద్యోగస్తులకు జీడీసీసీ అధికారుల బురిడీ
- ఆర్థికపరమైన విషయాలు అజెండాలో చేర్చి దొడ్డిదారిలో సంతకాలు
- ఎదురు తిరిగిన సహకార శాఖ ఉద్యోగులు
- నకిలీ రుణాల రికవరీ ఊసెత్తని మహాజన సభ సమావేశం
- సొసైటీలకు మేలు చేసే అంశం ఒక్కటీ లేదని ఆరోపణలు
- ఇకపై విమానంలోనే సీఈవో అధికారిక పర్యటనలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 12 : గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జీడీసీసీ) మహాజనసభ సమావేశంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో గురువారం జరిగిన ఈ సమావేశంలో జీడీసీసీ అధికారులు తోటి ఉద్యోగస్తులను బురిడీ కొట్టించారు. హాజరు తీసుకుంటున్నామని చెప్పి ఏకంగా తీర్మానాలపై సంతకాలు తీసుకోవడం వివాదాస్పదమైంది. ఆర్థికపరమైన విషయాలు అజెండాలో చేర్చి దొడ్డిదారిలో సంతకాలు తీసుకున్నారని సొసైటీలకు పర్సన్ ఇంచార్జి లుగా ఉన్న సహకార శాఖ ఉద్యోగులు ఎదురు తిరగడంతో వ్యవహారం రచ్చకెక్కింది. తొలుత జీడీసీసీ బ్యాంకు 114వ వార్షిక నివేదికను, టేబుల్ అజెండా పత్రాలను సొసైటీలకు పర్సన్ ఇంచార్జిలకు అందజేశారు. సమావేశానికి వచ్చిన వారి హాజరు తీసుకుంటున్నామని చెప్పి వారితో సంతకాలు తీసు కున్నారు. బ్యాంకు పర్సన్ ఇంచార్జిగా ఉన్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ వచ్చిన తరువాత సమావేశం ప్రారంభించారు. కొద్ది సేపు వార్షిక నివేదిక, టేబుల్ అజెండాపై అధికారులు మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సమావేశం ముగించి వెళ్లిపోయారు. ఆ తర్వాత సొసైటీలకు పర్సన్ ఇంచార్జిలుగా ఉన్న సహకార శాఖ ఉద్యోగులు తీర్మాణం పుస్తకం కావాలని బ్యాంకు సీఈఓ కృష్ణవేణిని అడిగారు. అందుకు ఆమె సమాధానం దాటవేయడంతో ఉద్యోగులు ప్రత్యేకంగా సమావేశమై సభలో ప్రవేశపెట్టిన తీర్మానాలను తాము ఆమోదించ బోమని రాత పూర్వకంగా తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిలు మాట్లాడుతూ మహాజన సమావేశానికి సంబంధించిన తీర్మానాలు రాసేందుకు పుస్తకం లేదని సీఈఓ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంత పెద్ద బ్యాంకులో తీర్మానాలను రాసే పద్ధతి లేదని చెప్పడం అందరినీ మోసగించడమేనని అన్నారు. ఈ సమావేశంలో జరిగిన తీర్మానాలకు తమకు ఏ విధమైన సంబంధం లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు.

**స్వప్రయోజనాలు తప్ప....**

జీడీసీసీ బ్యాంకు మహాజన సభ సమావేశంలో అక్కడ పనిచేస్తున్న అధికారుల ప్రయోజనాలు తప్ప మరేమీ లేవు. గత కొన్ని రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో జీడీసీసీ బ్యాంకులు వేదికగా అనేక కుంభకోణాలు జరిగాయి. ఈ సమావేశంలో వాటి తాలూకా విచారణ నివేదికలను బయట పెడతారని,నకిలీ రుణాలను రికవరీ పై చర్చి స్తారని అందరూ భావించారు. కానీ, వాటి ప్రస్తావన లేకుండా నే సమావేశాన్ని 'మమ' అనిపించారు. రానున్న రోజుల్లో రైతు ప్రయోజనాలు ముడిపడిన సొసైటీలకు ఏమి మేలు చేస్తారన్న దానిపై కూడా చర్చ లేకుండానే సమావేశం ముగించారనే ఆరోపణలు వస్తు న్నాయి. జీడీసీసీలో పనిచేసే అధికారుల అలవెన్స్‌లు,ఇతర ప్రయోజనా లను అజెండాలో చేర్చి గుట్టుగా ఆమోదింపచేసుకున్నారు.

**విమాన ప్రయాణం..**

టేబుల్ అజెండాలో చేర్చిన మరో అంశం చర్చనీయాంశంగా మారింది. జీడీసీసీ సీఈఓ ఇకపై అధికారిక పర్యటన కోసం విమానంలో ప్రయాణించేందుకు వీలుగా తీర్మానం ప్రవేశపెట్టారు.రైల్లో ప్రయాణిస్తే సెకండ్ క్లాస్ ఏసీ, విమానం అయితే ఎకానమీ క్లాస్‌లో వెళ్ళేటట్టుగా తీర్మానం పెట్టారు.టేబుల్ ఎజండా సబ్జెక్ట్ 6 లోని 2,3,4,5,6 అంశాలపై సొసైటీ పర్సన్ ఇంచార్జిలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**కొత్త గా మూడు శాఖల ఏర్పాటు**

జీడీసీసీ అదనంగా 21 శాఖలు ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు పంపగా ఆర్‌బీఐ అందులో మూడింటికి పచ్చజెండా ఊపింది. పెదకాకాని, పెదనందిపాడు, ముట్లూరులో జీడీసీసీ బ్రాంచీలు ఏర్పాటు చేయనున్నట్లు వార్షిక నివేదికలో వెల్లడించారు. నికర లాభం రూ.21.94కోట్లు 2023-2024 సంవత్సరానికి గానూ బ్యాంకు నికర లాభం రూ. 21.94 కోట్ల ని నివేదికలో వెల్లడించారు.

# సీసం తవ్వకాలు జరిగేనా?



మూతపడిన ప్రవేశ ద్వారం

- బండ్లమోటులో రూ.కోట్ల ఖనిజ సంపద
- గనులు తిరిగి ప్రారంభిస్తే వేల మందికి ఉపాధి

వినుకొండ, సెప్టెంబరు 12: ఒకప్పుడు సీసం తవ్వకాలు.. తరలింపు.. కార్మికుల సందడితో బొల్లాపల్లి మండలంలోని బండ్లమోటు నిండి ఉండేది. అంతర్జాతీయంగా ఎంతో ప్రసిద్ధి చెందిన సీసం నిల్వలలకు కేంద్రంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలోని బండ్లమోటు గనులు ప్రసిద్ధిగా నిలిచాయి. అయితే దశాబ్దాల క్రితం మూతపడిన ఈ గనులను తిరిగి తెరిపిస్తే ఆదాయంతో పాటు వేలమందికి ఉపాధి లభిస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో శుద్ధి చేసిన ఖనిజానికి మంచి ధర లభిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని గనులను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. 1970లో జియాజికల్ సర్వేఆఫ్ ఇండియా సర్వేనిర్వహించి బండ్లమోటులో సీసం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. హిందూస్తాన్ కాపర్ లిమిటేడ్ 1978లో 490 మంది కార్మికులతో తవ్వకాలు చేపట్టింది. రోజుకు 240 టన్నుల సీసం శుద్ధిచేసేవారు. ఆ తర్వాత ఆర్థిక సరళీకృత విధానాలు అమల్లోకి వచ్చాక అంతర్జాతీయ మార్కెట్‌లో సీసం ధర తగ్గి ఉత్పత్తి ఖర్చుకు సమానం కావడంతో గనులను మూతేశారు. ఆ తర్వాత 1988లో వేదాంత గ్రూప్ గనులను సొంతం చేసుకున్నా నాలుగేళ్లకే మూసివేసింది.

**తాజాగా పెరిగిన ధరలు**

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో సీసం ధర పెరిగి టన్ను రూ.1.40 లక్షలకు చేరింది. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం బండ్లమోటులో తిరిగి తవ్వకాలు చేపట్టేందుకు 2022 డిసెంబరు 8న టెండర్ పిలిచింది. అయితే దీనిపై పెద్దగా ప్రచారంలేక ఒక్క కంపెనీ మాత్రమే టెండర్ దాఖలు చేసింది. దీనిని ఆమోదించకుండా రెండో సారి 2023లో ఓ ప్రయత్నం జరిగినా కేంద్ర గనుల శాఖ సలహా మేరకు టెండర్ రద్దు చేసింది. తర్వాత పలు సంస్థలు టెండర్ ధాఖలకు ముందుకు వచ్చినా ఎన్నికల పేరుతో గత పాలకులు మళ్లీ దాని వైపు చూడలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సీసం గనులను తెరిస్తే వెనుకబడిన వినుకొండ ప్రాంతంలో ఎంతోమందికి ఉపాధి అవకాశాలు వస్తాయి.



గతంలో ఉద్యోగుల కోసం నిర్మించిన కార్యాలయ భవనాలు

**లక్షల టన్నుల సీసం**

సుమారు 15 లక్షల టన్నుల సీసం నిల్వలు ఇక్కడ సిద్ధంగా ఉన్నట్ల విశ్రాంత ఉద్యోగులు చెబుతున్నారు. రోజుకు 250 టన్నులు వెలికితీసే అవకాశం ఉందని చెప్పారు. గనిలో తవ్వేకొద్ది ఇంకా ఖరీదైన సీసం ఉన్నట్లు ప్రయోగశాలల్లో తేలిందన్నారు. మరో పదేళ్లకు సరిపడ నిక్షేపాలు ఇక్కడి గనుల్లో ఉన్నాయని చెప్పారు. ఈ గనులు తెరిస్తే ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి లభిస్తుందంటున్నారు.

**సీపీఐ పోరాటం..**



బండ్లమోట్ వద్ద ఉన్న సీసం ఖనిజ నిక్షేపాలను వెలికి తీయాలని ఇప్పటికే సీపీఐ డిమాండ్ చేస్తూ వస్తోంది. దీనిపై ఇటీవల ప్రజా సంఘాల ఆద్వర్యంలో అఖిల పక్షం సమావేశం నిర్వహించి, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. విలువైన ఖనిజ సంపదను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు ఎమ్మెల్యే హామీ కూడా ఇచ్చారు.

- మారుతీ వరప్రసాద్, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి

# 17 నుంచి స్వచ్ఛతా హి సేవ

- జిల్లాలో అమలు ప్రణాళికపై కలెక్టర్ ఆదేశాలు



కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హి సేవా-2024 జిల్లాలో 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. స్వచ్ఛతా హి సేవపై కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజులు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు విజయవంతానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా అధికారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తాగునీటి సీసాలు, టైర్లు ఇతర వ్యర్థాలతో కళాకృతులు ఏర్పాటు చేసి ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్నారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు, సీపీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీపీవో భాస్కరరెడ్డి, ఐసీడీఎస్ అధికారి ఉమారాణి, సాంఘిక సంక్షేమ అధికారి ఓబుల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 29 వరకే ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవి

- నవంబరు 6 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం

నరసరావుపేట, సెప్టెంబరు 12: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ లక్ష్మణరావు పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగంగా పట్టభద్రులు ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పట్టభద్రులకు ఓటు నమోదు దరఖాస్తుకు నవంబరు 6 చివరి తేదీగా నిర్ణయించింది. ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు గురువారం ప్రకటించారు. ఈ ప్రకారం ఓటర్ల జాబితా ముద్రణ నవంబరు 20, ముసాయిదా ఓటర్లజాబితా ప్రకటన 23, అభ్యంతరాల స్వీకరణ 23 నుంచి డిసెంబరు 9, ఓటర్ల తుది జాబితాను 30న ప్రకటించనున్నారు.

# నష్టంపై నివేదిస్తాం



గుంటూరు చానల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, కలెక్టర్ తదితరులు

- బాధితులకు కేంద్ర బృందం హామీ
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన
- గుంటూరు చానల్‌తో పాటు మగ్గాల పరిశీలన

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడం పూర్తియిన అనంతరం నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదికను అందిస్తాం. అన్ని విధాలా ఆదుకుంటాం. అధైర్యపడవద్దు.. అని కేంద్ర బృందం సభ్యులు వరద బాధితులకు హామీ ఇచ్చారు. కేంద్రమంత్రిత్వ శాఖ డైరెక్టర్ వాగ్మరే(నాగపూర్), ఆర్థిక శాఖ కన్సల్‌టెంట్ ఆర్పీ కౌల్(ఢిల్లీ), గ్రామీణాభివృద్ధిశాఖ ఉపకార్యదర్శి ప్రదీప్‌కుమార్(ఢిల్లీ)తో కూడిన కేంద్ర బృందం గురువారం జిల్లాలో పంట నష్టం అంచనా పరిశీలన చేపట్టింది. పెదకాకాని, తెనాలి, మంగళగిరి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో ఈ బృందం పర్యటించింది. అంతకముందు కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ని కేంద్ర బృందం పరిశీలించింది. శాఖల వారీగా జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యల గురించి కలెక్టర్ నాగలక్ష్మి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం పెదకాకాని మండల పరిధిలోని గుంటూరు ఛానల్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. తెనాలి మండలం హాఫ్‌పేట - కొలకలూరు గ్రామాల మధ్య దెబ్బతిన్న పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. సాగుకు పెట్టిన పెట్టుబడుల గురించి రైతుల ద్వారా బృందంలోని అధికారులు తెలుసుకున్నారు. భారీ వర్షం కారణంగా పొలాల్లో నీరు చేరడంతో పాటు తుంగభద్ర డ్రెయిన్‌కు గండిపడటంతో పంటలు మునిగిపోయి పూర్తిగా దెబ్బతిన్నామని రైతులు చెప్పారు. కాల్వలకు గండ్లు పండకుండా చర్యలు చేపట్టడంతోపాటు పంటలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి తెలిపి తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.


- కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం పాతమంగళగిరి దింపుడు కళ్లెం వద్ద వర్షాలకు దెబ్బతిన్న చేనేత మగ్గాలను పరిశీలించింది. పరిశ్రమకు జరిగిన నష్టాన్ని కలెక్టరు కేంద్ర బృందానికి వివరించారు. మగ్గం గుంతల్లోకి నీరు చేరడం వల్ల నూలు, చీరలు, ఇతర ఉత్పత్తులకు సంబంధించి రూ.59.37 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు. తాడేపల్లిలోని మహానాడు కాలనీలో ముంపు వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర బృందంలోని సభ్యులు పరిశీలించారు. ఇళ్లలోకి వెళ్లి సామగ్రిని పరిశీలించారు.

8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

నిమజ్జనం ఊరేగింపులో ఘర్షణ
- శిలాఫలకాలను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు
- జనసేన, టీడీపీ వర్గీయులను అడ్డుకున్న వైసీపీ
- రాళ్ళు, సీసాలు రువ్వుకున్న ఇరు వర్గాలు

యువకుల ర్యాష్ డ్రైవింగ్
- ప్రశ్నించిన ఇద్దరిపై కత్తులతో దాడి

7 లో..



విజయవాడ వరద బాధితుల సహాయార్థం వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి గోనుగుంట్ల లీలావతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి రూ 50లక్షల విరాళం చెక్కును అందచేశారు.

-వినుకొండ

# సూపర్ హీరోల ప్రేమకథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ హీరో నాని చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఇది మార్వెల్ సూపర్‌హీరో సినిమా కాదు. ఈ సినిమాలో హీరోకి ఉండే పవర్ పేరు ప్రేమ. ఇద్దరు సూపర్ హీరోల మధ్య జరిగే లవ్ స్టోరీ ఇది. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేస్తూ చూసేలా ఉంటుంది' అన్నారు. అభిలాష్ మాట్లాడుతూ 'తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రాసుకున్న అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. మా టీం చాలా కష్టపడింది. అందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ ఆర్ణ తెలిపారు. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉందని సునీల్ చెప్పారు.



ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 50 లక్షల విరాళం ప్రకటించిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సీఎం చంద్రబాబునాయుడును కలసి చెక్కును అందజేశారు. అలాగే రూ. 50 లక్షలు విరాళంగా ప్రకటించిన వెంకట్ అక్కినేని, రూ. 15 లక్షల సాయం ప్రకటించిన సిద్ధు జొన్నలగడ్డ, రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటించిన విష్వక్‌సేన్ సీఎంను కలసి చెక్కులు అందజేశారు.

# ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం

'ఈ సినిమాతో అందరికీ ఎమోషనల్ కనెక్షన్ ఉంది. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ఆసక్తితో అందరూ పని చేశారు. నేను సలహాలు ఇవ్వడం వరకే కానీ నిజానికి కష్టపడింది మాత్రం టీమే. వీళ్ల కష్టానికి తగిన ఫలితం మంచి హిట్ ద్వారా వస్తుందని బలంగా కోరుకుంటున్నాను' అన్నారు దర్శకుడు మారుతి. రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన పాల్గొన్నారు. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'మా సినిమాకు అతి ముఖ్యమైన వ్యక్తి దర్శకుడు శివసాయి. మారుతిగారు చెప్పిన పాయింట్‌ను అద్భుతంగా తెరకు ఎక్కించారు. పని రాక్షసుడు. నన్ను చాలా కొత్తగా



చూపించాడు. గ్రేట్ డైరెక్టర్ సింగీతం గారితో కలసి పని చేయడం గొప్ప అనుభూతి' అన్నారు. తన పదిహేనేళ్ల కలను నిజం చేసిన మారుతికి దర్శకుడు శివసాయి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రమిదని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

# పాటల ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయిన గురుచరణ్



'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిల', 'ముసిముసి నవ్వుల లోన..' 'నీక్కావాల్సింది నా దగ్గర ఉంది' వంటి మెలోడీ సాంగ్స్ రాసిన గురుచరణ్ (77) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం కన్నుమూశారు. గురుచరణ్ అసలు పేరు మానాపురం రాజేంద్రప్రసాద్. ఎన్టీఆర్, శోభన్‌బాబు నటించిన పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన పాత తరం దర్శకుడు మానాపురం అప్పారావు తనయుడే ఈ రాజేంద్రప్రసాద్. వాళ్ల అమ్మగారు ఎం.ఆర్. తిలకం కూడా నటీమణే. (ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రంలో 'పోవు చున్నావా యమధర్మ రాజా' పాట పాడింది ఆవిడే) ఎం.ఎ. చదివిన గురుచరణ్ ప్రముఖ గీత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. గురువు మీద గౌరవంతో 'గురుచరణ్' అని తన పేరు మార్చుకుని, ఆ పేరుతోనే పరిశ్రమలో కొనసాగారు. మోహన్‌బాబు నిర్మించిన 'అల్లుడు గారు' గీత రచయితగా గురుచరణ్ తొలి చిత్రం. 'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు' ఆయన రాసిన తొలి పాట. గురుచరణ్ అంటే మోహన్ బాబుకు ఎంతో అభిమానం. తను నిర్మించిన ప్రతి చిత్రంలోనూ గురుచరణ్‌తో కనీసం ఒక పాటన్నా రాయించేవారు. రెండు వందలకు పైగా పాటలు రాసిన గురుచరణ్ కొన్ని అనువాద చిత్రాలకు మాటలు కూడా రాశారు. గురుచరణ్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



# నిదుర కుదురు చెదిరిపోయే



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. సంగీర్తన కథానాయిక. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 12న ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం 'నువ్వే నాకు లోకం... నిదుర కుదురు చెదిరిపోయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. దూరమైన భార్యను గుర్తు చేసుకుంటూ భర్త మనసు పడే బాధను వర్ణిస్తూ సాగే ఈ గీతానికి కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చారు. కార్తీక్ హృద్యంగా ఆలపించారు.

## అప్‌డేట్స్

### దాండియా ఆడుతూ..



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో తన్వీ రామ్ పోషిస్తున్న రాధ పాత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దాండియా ఆడుతూ అందంగా కనిపిస్తూ తన్వీ రామ్ అందరినీ ఆకట్టుకుంటోంది. 'క'లో ఆమెది కీలకమైన పాత్ర. జంట దర్శకులు సుజీత్, సందీప్ దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చింతా గోపాలకృష్ణారెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో త్వరలో ఈ సినిమా విడుదల కానుంది.

### ప్రకృతిని కాపాడే బందీ



ఆదిత్య ఓం నటించిన 'బందీ' చిత్రం త్వరలో విడుదల కానుంది. తిరుమల రఘు స్వీయ దర్శకత్వంలో వెంకటేశ్వరరావుతో కలసి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన అనంతరం రఘు మాట్లాడుతూ 'ఒకే ఒక్క పాత్రతో రూపుదిద్దుకున్న చిత్రమిది. ప్రకృతిని నాశనం చేసే కార్పొరేట్ కంపెనీలకు లీగల్ అడ్వైజర్‌గా ఉండే పాత్రను ఆదిత్య ఓం పోషించారు. అటువంటి వ్యక్తిని అడవుల్లో వదిలేస్తే ఏలా ఉంటుందనే ఆసక్తికరమైన కథనంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. మా హీరో ఇప్పుడు 'బిగ్‌బాస్'లో ఉన్నారు. ఆయన సక్సెస్ అయి వస్తాడని ఆశిస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. అమెరికాలో ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వీఎఫ్ఎక్స్ హెడ్ జాకబ్ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

## మంగళగిరి క్రికెట్ స్టేడియం అభివృద్ధి వేగవంతం

● ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

మంగళగిరి, సెప్టెంబరు 12: అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించడమే లక్ష్యంగా మంగళగిరిలోని క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడతామని ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ ఛైర్మన్‌గా నియమితులైన శివనాథ్ గురు వారం మంగళగిరిలోని అంతర్జాతీయ స్టేడియాన్ని సందర్శించారు. అనంతరం ఏసీఏ కార్యాలయంలో జరిగిన తొలి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. కడప, మంగళగిరి క్రికెట్ స్టేడియాల అభివృద్ధి, కమిటీల నియామకం, అకాడమీల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ మాట్లాడుతూ అపెక్స్ కమిటీ సభ్యులతో కలిసి ఏకగ్రీవ తీర్మానాలతో ముందుకు వెళతామన్నారు. మంగళగిరి స్టేడియంలో స్పోర్ట్స్ హబ్ సెంటరును కూడా నెలకొల్పుతామన్నారు. స్టేడియానికి పశ్చిమాన బైపాస్ రోడ్డు నిర్మాణం నాలుగైదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. క్రికెట్ స్టేడియానికి వెళ్లే ప్రధాన రోడ్ల అభివృద్ధి, పార్కింగ్ స్థలాలపై మంత్రి నారా లోకేశ్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు వెంకట ప్రశాంత్, కార్యదర్శి సానా సతీశ్, సంయుక్త కార్యదర్శి విష్ణుకుమార్ రాజు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ విష్ణుతేజ్ తదితరులు పాల్గొన్నారు.

## టాంజానియా వర్సిటీతో ఏఎన్‌యూ ఎంఓయూ

పెదకాకాని, సెప్టెంబరు 12 : టాంజానియా దేశంలోని డొడొమ యూనివర్సిటీతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విదేశీ విద్యార్థుల విభాగం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. గురువారం టాంజానియా యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ లుఘానో జెరెమీ కుసిలుక, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య కే.గంగాధరరావులు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కే.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ.సింహాచలం సమక్షంలో ఈ ఎంఓయూ జరిగింది. విదేశీ విద్యార్థుల విభాగం ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి మాట్లాడుతూ పరస్పరం శిక్షణ, కన్సల్టెన్సీ, ఇన్నోవేషన్, టీచింగ్ అండ్ రీసెర్చ్ పరస్పర మార్పిడి, అకడమిక్ కార్యక్రమాల అభివృద్ధికి కోర్సుల రూపకల్పన, సంయుక్తంగా సైంటిఫిక్ టెక్నాలజీ పరిశోధనా ప్రాజెక్టుల అభివృద్ధితోపాటు రెండు యూనివర్సిటీలకి దోహదపడే పలు అంశాలను ఈ ఎంవోయూ ద్వారా నిర్వహించనున్నట్లు వివరించారు. టాంజా నియా యూనివర్సిటీ ప్రతినిధి కూసిలుకా మాట్లాడుతూ రెండు విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో ఈ ఎంఓయూ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య బి.సత్యనారాయణ ఉన్నారు.

## ఎకనామిక్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

● రాయలసీమ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్


పెదకాకాని, సెప్టెంబరు 12 : ప్రభుత్వ, ఇతర రంగాలలో ఎకనామిక్స్ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా సిలబస్ నిర్వహణ ఉండాలని, భారతదేశంలో ఆర్థికవేత్తలకు ప్రభుత్వ రంగం గణనీయమైన సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందని అన్నారు. కార్పొరేట్ రంగం లో మార్కెట్ పరిశోధన, ఆర్థిక విశ్లేషణ, వ్యాపార అభివృద్ధి వంటి వివిధ పాత్రలలో ఆర్థికవేత్తలను కూడా నియమించుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె. మధుబాబు, వర్సిటీ సోషల్ సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భారతి, సీనియర్ అధ్యాపకులు ఆచార్య సీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి విరాళం

● వినుకొండ ఎమ్మెల్యే, ఏపీ క్రెడాయ్ రూ.50 లక్షల చొప్పున చెక్కులు అందజేత

గుంటూరు( కార్పొరేషన్), సెప్టెంబరు 12 : రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్ తరఫున రూ.50 లక్షల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు గురువారం ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏపీ క్రెడాయ్ ఛైర్మన్ శివారెడ్డి, ప్రెసిడెంట్ రమణారావు, కార్యదర్శి బైన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ అంకినీడు రమేష్, విజయవాడ చాప్టర్ అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి శ్రీధర్, సభ్యులు వంశీ, సతీష్ చెరుకూరి తదితరులు కలిసి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ అసోసియేషన్ తరఫున మరో రూ.50 లక్షలను వివిధ రూపాలలో వరద బాధితులకు ఖర్చు చేసినట్లు చెప్పారు



ఏపీ క్రెడాయ్ తరఫున రూ.50 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న ఆళ్ల శివారెడ్డి తదితరులు

### సీఎంకు చెక్కును అందజేసిన జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 12: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల, ఆయన భార్య గోనుగుంట్ల లీలావతి ముఖ్యమంత్రినికలిసి రూ.50 లక్షల విరాళం చెక్కును అందజేశారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్, శివశక్తి బయోటెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ద్వారా ఈ చెక్కును అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో శివశక్తి కంపెనీ ఛైర్మన్ నందిగం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.



తల్లి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

## పుల్లారావు తల్లి అంత్యక్రియలు పూర్తి

చిలకలూరిపేట, సెప్టెంబరు 12 : మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తల్లి నారాయణమ్మ అంత్య క్రియలు గురువారం జరిగాయి. చిలకలూరిపేటలోని ప్రత్తిపాటి నివాసం నుంచి గణపవరంలోని ఎల్‌సీటీ కంపెనీ వరకు అంతిమయాత్ర సాగింది.ఎల్‌సీటీ కంపెనీ ప్రాంగణంలో దహన సంస్కారాలు నిర్వహించారు. నారాయణమ్మకు కడసారి వీడ్కోలు పలికేందుకు తెలుగుదేశం పార్టీతో సహా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు తరలివచ్చారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లాఎస్పీ కంచి శ్రీనివాసరావు తది తరులు ప్రత్తిపాటి పుల్లారావును పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట, గురజాల, పెదకూరపాడు, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేలు వరుసగా చదలవాడ అరవిందబాబు, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, నజీర్, గల్లా మాధవి, ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, గొట్టిపాటి భరత్, మల్లెల రాజేష్ నాయుడు, జనసేన నాయకులు తోట రాజా రమేష్, విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య, భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ఉన్నారు.

# మానసిక బాధను తెలుసుకుంటే ఆత్మహత్యల నివారణ సాధ్యమే

● ప్రొఫెసర్ ఉమాజ్యోతి

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 12: ఆత్మహత్య ప్రయత్నాలు చేసే వారిని వేధించే మానసిక బాధను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చేయూత అందిస్తే చాల వరకు ఆత్మహత్య ఘటనలను నివారించవచ్చని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎన్. ఉమాజ్యోతి తెలిపారు. గురువారం వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే పురస్కరించుకొని ప్రభుత్వాస్పత్రి సైకియాట్రి వార్డులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆత్మహత్యయత్నాలు చేసే వారిలో సాధారణంగా మానసిక వ్యాకులత అనే జబ్బు ఉంటుందని, వీరు విచారంగా ఉండటం, ఒంటరిగా గడపటం, తరచూ తమ జీవితం వ్యర్థమని, చావే పరిష్కారమని చెబుతుంటారని ఆమె వివరించారు. వ్యక్తుల్లో ఇలాంటి లక్షణాలు గమనిస్తే కనుక వారి కుటుంబ సభ్యులు అశ్రద్ధ చేయకుండా తగిన చికిత్సలు చేయించాలని తెలిపారు. దీని వల్ల చాల వరకు ఆత్మహత్యల నివారణ సాధ్యపడుతుందని, బాధితులకు వైద్యనిపుణులు తరచూ కౌన్సెలింగ్ చేయడంతో పాటు తగిన మందులు వాడటం ద్వారా వారి ఆలోచనలను సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో మానసిక వ్యాధుల వైద్యవిభాగం నిపుణులు వీ వెంకట కిరణ్, డాక్టర్ రత్నకిషయ్, పీ సాయికిరణ్, ఎస్ నిమీషా, వీ సాయికృష్ణ, ఎస్ ప్రసాద్, సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ ఏవిజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైకియాట్రి వార్డులో రోగుల కోసం రూ.25 వేలు విలువైన కుర్చీలను సెవెన్ గ్రీన్ ఛారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకులు సిద్దార్థ అందజేశారు.




మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎన్.ఉమాజ్యోతి

## నిమజ్జనం ఊరేగింపులో ఘర్షణ

● జనసేన,టీడీపీ వర్గీయులను అడ్డుకున్న వైసీపీ

● రాళ్ళు,సీసాలు రువ్వుకున్న ఇరువర్గాలు

బొమ్మరాజుపల్లి(ఈపూరు)సెప్టెంబరు12: మండలంలోని బొమ్మరాజుపల్లిలో వినాయకుని విగ్రహం నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమంలో ఉద్రిక్తత నెలకొని ఘర్షణకు దారితీసింది. టీడీపీ,జనసేన నాయకులు ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం నిమజ్జనం నిమిత్తం గ్రామంలో భోజనాలు ఏర్పాటు చేశారు. అయితే, ఆ సమయంలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అనంతరం నిమజ్జనం నిమిత్తం వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తుండగా.. ఆ ఊరేగింపు ప్రధాన సెంటర్‌కు చేరుకునే సమయంలో జనసేన,టీడీపీ వర్గీయులను అడ్డుకున్న వైసీపీ వర్గీయులు, ఆ శిలాఫలకాలను ధ్వంసం చేశారంటూ వారితో వాదనకు దిగడమే కాకుండా వారిపై రాళ్ళుసీసాలు రువ్వి, కర్రలతో దాడి చేశారు. ఇరు వర్గాలవారు కర్రలు, రాళ్ళుసీసాలను ఒకరిపైఒకరు రువ్వుకున్నారు. వైసీపీ దాడిలో పదిమంది గాయాల పాల య్యారు. జనసేన సిమెంట్ బల్లను ధ్వంసం చేశారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన కారులను పోలీసులు అక్కడ నుండి తరిమి వేశారు. బాధి తుల ఫిర్యాదు మేరకు దాడులకు పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు.



వైసీపీ వాళ్ళు ధ్వంసం చేసిన జనసేన సిమెంట్ బల్ల, గుర్తుతెలియనివ్యక్తులు ధ్వంసం చేసిన శిలాఫలకం

## యువకుల ర్యాష్ డ్రైవింగ్

● ప్రశ్నించిన ఇద్దరిపై కత్తులతో దాడి

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 : ముగ్గురు యువకులపై కత్తులతో ఏడుగురు యువకులు దాడి చేసి గాయ పరిచిన సంఘటన స్థానిక వడ్డవల్లి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద బుధవారం అర్థరాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు.. దేవాలయం వద్ద వినాయక మండపం ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మునిసిపల్ ఏరియాకు చెందిన యువకులు అచ్యుత్, జీవన్ తమ బైక్ పై వేగంగా ఆ ప్రాంతానికి వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కఠారి వెంకటేష్, రాజమంచి పవన్ కల్యాణ్‌లు అతివేగంగా బైక్ నడపడమేంటని పశ్నించారు. దీంతో, ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారి తీసింది. ఈక్రమంలో అక్కడి నుంచి బైక్ పై వెళ్ళిపోయిన జీవన్, అచ్యుత్‌లు తిరిగి రాత్రి 12 గంటల సమయంలో మరో ఐదుగురిని వెంట తీసుకొని ఆ వినాయక మండపం వద్దకు వచ్చి.. అక్కడే ఉన్న వెంకటేష్, పవన్ కళ్యాణ్‌లను తమ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్లు, కత్తులతో పొడిచి గాయ'పరిచారు. వారిని అడ్డుకున్న యువకుడు పూర్ణని కూడా కత్తితో గాయ'పరిచారు. అక్కడి జనం రావడంతో దాడి చేసిన ఏడుగురు యువ కులు తమ వాహనాలపై పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన వెంకటేష్, పవన్ కల్యాణ్‌లను వారి కుటుంబసభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనకు పాల్పడ్డ యువకుల గృహాల వైపు బాధితుల బంధువులు, కుటుంబసభ్యులు వెళ్లి వారి గృహాలపై రాళ్ళతో దాడి చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ బ్రహ్మయ్య, రూరల్ సీఐ శ్రీని వాసరావు, పట్టణ ఎస్ఐ సంధ్యారాణి ఆ ప్రాంతానికి వెళ్లి ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపించివేశారు. పోలీస్ జీపు పై కూడా క్షతగాత్రుల బంధువుల్లో కొందరు రాళ్ళు రువ్వారు. దాడికి పాల్పడ్డ యువకుల స్కూటీని బాధి తుల బంధువులు దగ్ధం చేశారు. దాడికి పాల్పడ్డ జీవన్, అచ్యుత్‌లతో పాటు మరో ఐదుగురు యువకులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని విచారించినట్లు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. దాడికి ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకున్నా మని, క్షతగాత్రుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు చెప్పారు.



కత్తుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ కఠారి వెంకటేష్, రాచమంచి పవన్ కల్యాణ్



# నిషేధిత భూమిలో బినామీ అక్రమ నిర్మాణం!

● రాజధాని అమరావతి ప్రాంతంలో దర్జాగా కబ్జా

● నవులూరు రాజీవ్ నగర్‌లో అక్రమ నిర్మాణం

● మిగిలిన భూమి ఓ మాజీ ప్రజాప్రతినిధి పీఏ ఆధీనంలో

మంగళగిరి, సెప్టెంబరు 12: రాజధాని అమరావతి ప్రాంతంలో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తూ పెద్ద భవంతులు నిర్మిస్తున్నారు. మంగళగిరి మండలం నవులూరు రాజీవ్ నగర్‌లోని సీఆర్‌డీఏ నిషేదిత జాబితాలో వున్న భూమిని ఆక్రమించుకుని ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా కళ్యాణ మండపాన్నే నిర్మించారు. దీనికి మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు ఇంటి పన్ను ఎలా ఇచ్చారనే విషయం చర్చనీయాంశంగా మారింది. రాజధాని ప్రాంతానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన బినామీ ఈ కట్టడాన్ని నిర్మించినట్టుగా తెలుస్తోంది. కళ్యాణ మండపం నిర్మించగా మిగులు భూమి సదరు ప్రజాప్రతినిధి పీఏ ఆధీనంలో వున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం చివరి కాలంలో ఈ అక్రమ నిర్మాణం జరుగగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటి పన్ను మంజూరైనట్టు సమాచారం. అధికారులు, పాలకులు స్పందించి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిషేధిత భూమిలో నిర్మించిన ఫంక్షన్ హాలు

## అమరావతిలో విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధం

● కేంద్ర విమానయాన శాఖ కార్యదర్శి అమిత్ కుమార్ ఝా

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 12 :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపితే రాజధాని అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి అమిత్ కుమార్ ఝా తెలిపారు. ఈ విషయాన్ని అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులకు కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఓ లేఖ ద్వారా తెలిపారు. కూటమి ప్రభుత్వం అమరావతిలో నూతన రాజధాని నిర్మాణం కోసం అడుగులు వేస్తున్న దరిమిలా ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది పెట్టుబడిదారులను ఆకర్షించే అవకాశం ఉందని డాక్టర్ వీరాంజనేయులు గడచిన ఆగస్టు 2న ప్రధాన మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుని ఢిల్లీలో వ్యక్తిగతంగా కలిసి ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో అమిత్ కుమార్ జా స్పందిస్తూ తమ అభిప్రాయాన్ని లేఖ ద్వారా తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించిన విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్తానని జాస్తి వీరాంజనేయులు తెలిపారు.



## 8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 12: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 8 క్రస్ట్ గేట్ల ద్వారా గురువారం అధికారులు నీటిని విడుదల చేశారు. 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2926 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,273 క్యూసెక్కులు, 8 క్రస్ట్ గేట్ల ద్వారా 64,720 క్యూసెక్కులు,ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,08,706 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,08,706 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

### పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 12 : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,14,970 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందని తెలిపారు. ప్రాజెక్టు వద్ద మూడు గేట్ల ద్వారా 87,909 క్యూసెక్కుల నీరు, పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

### 0.7326 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,సెప్టెంబరు 12 : సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.7326 విద్యుత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు.ప్రాజెక్టుకు చెందిన 5 రేడియల్ క్రస్ట్ గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 78425,టేల్ రేస్ ఛానల్ ద్వారా 8215 మొత్తంగా 86,640 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు.రిజర్వాయర్‌లో 75.37 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.991 టీఎంసీలకు సమానమన్నారు.

## ప్రకాశం బ్యారేజి దిగువకు 49 వేల 450 క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 3918 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 12: ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 53వేల 368 క్యూసెక్కుల వరద నీరు గురువారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు మేర, 10 గేట్లను 2 అడుగులు ఎత్తి దిగువకు 49 వేల 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 3918 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

## జడ్పీ సీఈవో మాతృ శాఖకు బదిలీ

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్తు సీఈవో వసంత రాయుడుని మాతృశాఖకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ శాఖకు చెందిన వసంతరాయుడు ఎన్నికలకు ముందు బదిలీపై జడ్పీ సీఈవోగా నియమితులయ్యారు. ఆయనతో పాటు రెవెన్యూ నుంచి వచ్చి వేరే జిల్లాల్లో పంచాయతీరాజ్‌లో కొనసాగుతోన్న మరో ముగ్గురిని కూడా మాతృశాఖకు పంపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## 22 వరకు ఉద్యోగస్తుల బదిలీలు

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై సడలించిన నిషేధాన్ని ఈ నెల 22వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. 23 నుంచి బ్యాన్ అమలులోకి వస్తుందని తాజాగా ప్రభుత్వ సాధా రణ పరిపాలన విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కారణంగా ఉద్యో గుల బదిలీల ప్రక్రియకు ఆటంకం వాటిల్లింది. కొంతమంది అధికారులు విజయవాడలో వరద సహాయక, ఎన్యూమరేషన్ విధులకు వెళ్లాల్సి వచ్చింది. దీనిని పరిగణనలోకి తీసు కొని 22 వరకు బదిలీలు చేసు కోవచ్చని పేర్కొంది.

## చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి

మంగళగిరి, సెప్టెంబరు 12: రాష్ట్రంలోని చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. ఒక్కొక్కరికి రూ.2,100 చొప్పున రాష్ట్రంలోని లక్షా 22 వేల 864 చేనేత కుటుంబాలకు రూ.25.76 కోట్ల మేర ఆరోగ్య బీమా చెల్లిం చేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఐసీఐసీ లాంబార్డ్ 2006లో ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమా పథ కంలో ప్రీమియం మొత్తం రూ.1450లో కార్మికుడు రూ.200 చెల్లించాల్సి వచ్చేదని, మిగతా రూ. 1250 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించి బీమాను అమలు చేసేవని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులు చెల్లించాల్సిన బీమా మొత్తాన్ని చెల్లిం చేందుకు ముందుకు రావడం అభినందనీయ మన్నారు. గడచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. గత ఎన్ని కలకు ముందు చంద్రబాబు, లోకేశ్‌లు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ చేనేతల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 125, 134,145 |
| చికెన్ విత్ స్కిన్ | 236.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 246.00 |

## 50,049 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు గురువారం 47,159 మిర్చి టిక్కీలు విక్రయానికి వచ్చాయి. వీటితో పాటు నిల్వ ఉన్న వాటిని కూడా కలుపుకుని 50,049 టిక్కీల అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 17,085 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 7500 | 16500 | 334 | 8000 | 16200 |
| నెంబరు. 5 | 9200 | 15000 | నెంబరు.5 | 11500 | 14000 |
| 273 | 10000 | 14200 | 273 | 11200 | 13500 |
| 341 | 8000 | 16000 | 341 | 10500 | 15500 |
| 4884 | -- | -- | 4884 | 9200 | 14500 |
| సూపర్ 10 | 13500 | 16500 | సూపర్ 10 | -- | -- |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 7500 | 18700 | తేజ | 8500 | 18800 |
| బ్యాడిగి | 8500 | 15000 | బ్యాడిగి | 9000 | 14500 |
| దేవనూరు డీలక్స్ | 11000 | 13000 | దేవనూరు డీలక్స్ | 9000 | 15000 |
| తెల్లకాయలు | 5000 | 12000 | తెల్లకాయలు | 4500 | 10500 |

### వరద బాధితులకు రైతు విరాళం



రెంటచింతలకు చెందిన రైతు తుమ్మా జోజిరెడ్డి విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.50 వేల చెక్కును గురువారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి ఉన్నారు. - రెంటచింతల



అమరావతిలో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## దేశం ముద్దు బిడ్డను కోల్పోయింది : సీపీఎం

● సీతారాం ఏచూరి మృతికి సంతాపం

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 : కార్మిక వర్గ రాజ్య స్థాపనకై అహర్నిశలు కృషి చేసిన సీతారాం ఏచూరి లాంటి ముద్దబిడ్డను దేశం కోల్పోయిందని సీపీఎం నేతలు అన్నారు. గురువారం స్థానిక పుతుంబాక భవన్‌లో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు విజయ కుమార్, గద్దె చలమయ్య, ఏ వీరబ్రహ్మం, కే శివ దుర్గారావు, గద్దె ఉమశ్రీ, మునగా జ్యోతి, ప్రభాకర్, జీ రజిని, అమూల్య, రాజ్ కుమార్, ఎం హరి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

**అమరావతి:** స్థానిక సీపీఎం నేతలు బీ.కోటేశ్వరరావు, సూరిబాబులు వెంకటే శ్వరరాజు, మోహిద్దీన్‌వలి, షేక్ నాగులమీర, టీ.కృష్ణ, ఎస్‌కె రఫీ, ప్రసాద్ తదితరులు సీతారం ఏచూరి చిత్రపటానికి నివాళుర్పించారు.

**దాచేపల్లి:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని మండల సీపీఎం, బ్రాహ్మణ సంఘం నేతలు అన్నారు. ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

**మాచర్లటౌన్:** సీపీఎం సీనియర్ నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం యేచూరి మరణం భారత రాజకీయాలకే తీరని లోటని సీపీఎం నేత బండ్ల మహేష్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగుపెట్టిన సీతారం దాదాపు 50 ఏళ్లుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. నేటి తరానికి ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వై.సురేష్, వెంకట రత్నం, బత్తుల శ్రీను, మహేష్, వేముల వెంకట్రావు పాల్గొన్నారు.

**సత్తెనపల్లి:** సీపీఎం నేత సీతారామ్ ఏచూరి మృతి పట్ల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. రాజకీయాల్లో అత్యంత గౌరవ ప్రదమైన నాయకుడు ఏచూరి అని, రాజకీయాలకు అతీతంగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు అన్నారు. ఏచూరి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కన్నా ప్రగాడ సానుభూతిని తెలియ జేశారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

● ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధరబాబు

దుర్గి, సెప్టెంబరు 12: ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధరబాబు కోరారు. గురువారం మండలంలోని ముటుకూరు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎస్టీయూ సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా గంగాధరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను విద్యావ లంటీర్ల ద్వారానైనా భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ దుర్గి మండల అధ్యక్షుడు నబి సాహెబ్, కార్యదర్శి కటకం అపర్ణ, భారతి, ఎర్రం ఏడుకొండలు, బూసాని శ్రీనివాసరావు, అనంతరామయ్య, బొమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌పై చర్యలు తీసుకోవాలి


సత్తెనపల్లి, సెప్టెంబరు 12 : టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన ముద్దాయిలను ఆశ్రయం కల్పిస్తున్న వైఎస్ జగన్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా నదిలో పడవలు వదిలిన విషయం మాజీ సీఎం వైఎస్ జగన్ నేర పూరిత బుద్ధిని బహిర్గతం చేస్తుందన్నారు. సమావేశంలో నేతలు పూజల వెంకట కోటయ్య, కంభాల వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, బాపయ్య చౌదరి, షేక్ జానీ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## సంపద తయారీ కేంద్రాలను సిద్ధం చేయాలి

మాచవరం, సెప్టెంబరు 12 : సెప్టెంబరు చివరికల్లా అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలను సిద్ధం చేయాలని ఈవోఆర్‌డీ వెంగళరావు ఆయా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలను నిర్వహణలోకి తీసుకురావాలని తెలిపారు. ఈనెల 14 నుంచి అక్టోబరు 1వ తేదీ లోపు అన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను సిద్ధం చేసి కేంద్రాల్లో వ్యవసాయ ఉత్పత్తులను తయారుచేయాలని సూచించారు. అదే విధంగా అన్ని గ్రామాల్లో సమాచార హక్కుకు సంబంధించి పెండింగ్ లేకుండా చూసుకోవాలని, 2023-24 సంవత్సరానికి సంబంధించి జమలు, ఖర్చులు అందజేయాలని, అన్నిగ్రామాల్లో ఆడిట్ పూర్తి చేయించాలని, పారిశుధ్య కార్యక్రమాలను పీఆర్-1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ఆదేశించారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సమన్వయంతో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ప్రసాదు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 12: పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి నందిపాటి శ్రీనివాసరెడ్డి గురువారం తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. రైతులకు ఎరువులు అమ్మిన వెంటనే ఈ-పాస్ తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో ఎన్. శ్రీనివాసరెడ్డి తదితరులు

## చేనేత సహకార సంఘాలకు పూర్వ వైభవం

● పాలక వర్గాల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం నిర్ణయం

● అధికారుల కమిటీలతో చేతులు దులుపుకున్న గత వైసీపీ ప్రభుత్వం



ఫణిదం చేనేత సహకార సంఘంలో పని చేస్తున్న మహిళా నేత కార్మికులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 12: చేనేత రంగానికి పూర్వ వైభవం రానుంది. సహకార సంఘాల బలోపేతానికి అడుగులు పడుతున్నాయి. సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించటంతో చేనేత శాఖ చర్యలు చేపట్టింది. పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట, మాచవరం, కొత్తపల్లి సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సహకార సంఘాల పరిధిలో చేనేత కార్మికులు ఉపాధిని పొందుతున్నారు. ముడి సరుకుల ధరల పెరుగుదల, గిట్టుబాటు కాని అమ్మకాలు, కూలీ తదితరాలతో చేనేతరంగం ఆ ప్రభావాన్ని కోల్పోతుంది. ఎక్కువ మంది వృత్తిని వదిలివేసి ప్రత్యామ్నాయ పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. గత ప్రభుత్వ నిర్వాహకంతో చేనేత రంగం నిర్వీర్యం అయింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘాలకు ఎన్నికలు నిర్వహించ కుండా అధికారుల కమిటీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. నిధులు విడుదల చేయకపోవటం సంఘాలు నిర్వీర్యమయ్యాయి.

కూటమి ప్రభుత్వం చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 21 నుంచి ప్రక్రియ మొదలై డిసెంబరు 6న పాలక వర్గాలు కొలువు దీరేలా ఆదేశాలు జారీ చేసింది. ఒక్కొక్క సంఘానికి తొమ్మిది మంది సభ్యులతో పాలకవర్గాన్ని ఎన్నుకోనున్నారు. వారిలో ఇద్దరు మహిళలు ఉండాలి. ఈ ఎన్నికలతో సంఘాల్లో పని చేసే కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నామని, ఇది చేనేత రంగానికి ఎంతో ఉపయోగమని ఫణిదం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు తెలిపారు. 2014 -19 మధ్య ఎలాంటి లబ్ధి చేకూరిందో అదే స్థాయిలో పథకాలను కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టనుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఆప్కో వ్యవస్థను పునరుద్ధరించి నియోజవర్గ కేంద్రాల్లో వస్త్రాలను విక్రయించే సదుపాయం, సొసైటీల వద్ద వర్క్ షెడ్ల నిర్మాణాలకు ప్రత్యేక రుణాలు, ఉచిత విద్యుత్, బీమాతో పాటు వర్షాకాలంలో ఆదుకొనేందుకు పరిహారం, పరపతి రుణాలు, కేంద్ర ప్రభుత్వ రాయితీలు ప్రభుత్వం కల్పిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## ఇద్దరు క్షేత్ర సహాయకుల తొలగింపు

దుర్గి, సెప్టెంబరు 12: మండల పరిధిలోని ఇద్దరు క్షేత్ర సహాయకులను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ గుప్తా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5న మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని ఆత్మకూరు, శ్యామరాజపురం క్షేత్ర సహాయకులు చిన్నపురెడ్డి, కొండలరావులు తమ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, వీఆర్‌ఏలు, అంగన్‌వాడీ ఆయాల పేర్లతో మస్టర్‌లు నమోదు చేసి ఉపాధిహామీ పనులకు హాజరైనట్లు చూపి నిధులు పక్కదారి పట్టించినట్లు తనిఖీ అధికారులు గుర్తించారు. దీనిపై పంచాయతీ గ్రామీణ అభివృద్ధిశాఖ డైరెక్టర్ కార్యాలయం ఆదేశాల మేరకు విచారణ చేపట్టి చిన్నపురెడ్డి, కొండలరావులను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ గుప్తా తెలిపారు.

## సమాచార హక్కుచట్టంపై అవగాహన

ముప్పాళ్ళ, సెప్టెంబరు 12 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కార్యాలయ అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం భవానీశంకర్ మాట్లాడుతూ సమాచారం అడిగే హక్కు పౌరులందరికీ ఉంటుందని, వారు అడిగిన వివరాలను అధికారులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అవినీతిని నిరోధించేందుకు అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనాన్ని తీసుకురావటం కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారి అరుణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించటం, పరిమిత ద్రవ్య వనరులను సమర్దవంతంగా వినియోగించటం కొరకు చట్టం రూపొందించారన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు సమాచారాన్ని నకళ్ళ ద్వారానో, సర్టిఫైడ్ కాపీలను తీసుకోవటం, సీడీలు, టేపులు, వీడియో క్యాసెట్ల రూపంలో మరేదైనా ఎలక్ట్రానిక్ రూపంలో తీసుకోవచ్చున్నారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పశువులకు గాలి కుంటు టీకాలు

అచ్చంపేట, సెప్టెంబరు 12 :మండలంలోని వేల్పూరు, అచ్చంపేట, చెరుకుంపాలెం తదితర గ్రామాల్లో ఇప్పటివరకు 10 వేల పశువులకు గాలి కుంటు టీకాలు వేసినట్టు పశువుల వైద్యులు శ్వేతాదేవి గురువారం తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ పశువులు, దూడలకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులకు 104 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుందని, మేత, నీరు తీసుకోవని తెలిపారు. వాటి నోట్లో, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయని తెలిపారు. ముందస్తుగా ఈ వ్యాధి రాకుండా పశు పోషకులు తమ పశువులకు గాలి కుంటు టీకాలు వేయించాలని ఆమె సూచించారు.



గారపాడులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామారావు, సాగర్ తదితరులు

## 'డయల్ యువర్ ఎమ్మెల్యే' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెదకూరపాడు, సెప్టెంబరు 12 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమస్యలను పరిష్కరిస్తున్నారని సత్తెనపల్లి మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ పెనుముచ్చు రామారావు, తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షులు మక్కెన సాగర్‌లు అన్నారు. మండలంలోని గారపాడులో గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమ గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు. ప్రజా పాలనలో ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ వినూత్న ఆలోచనలతో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని, ఒక్క ఫోన్ కాల్‌తో ప్రజా సమస్యల పరిష్కారం జరుగుతుందని వారు వివరించారు.

## వరదలపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 : వరదలపై వైఎస్ జగన్ బురద వ్యాఖ్యలు సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. వరద బాధితులకు అండగా నిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషిని దేశం మొత్తం చూస్తుందన్నారు. వైఎస్ జగన్ మాత్రం మొక్కుబడిగా పర్యటించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంతో సరిపుచ్చుకున్నారని వందనాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు.



పనుల సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

## నడికూడి-బీబీనగర్ రైల్వే పనుల తనిఖీ

దాచేపల్లి, సెప్టెంబరు 12: నడికూడి రైల్వేజంక్షన్ నుండి బీబీనగర్ వరకు కేంద్ర ప్రభుత్వం డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా పొందుగల వద్ద చేపట్టిన సర్వే పనులను గురజాల ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, దాచేపల్లి తహసీల్దార్ రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలుచేశారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు పలువురు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

నకరికల్లు, సెప్టెంబరు 12 : గర్భిణీలకు, బాలింతలకు, కిషోర బాలికలకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ కండ్లకుంట సెక్టార్ సూపర్ వైజర్ జే ఆనంద కుమారి తెలిపారు. గురువారం దేచవరం - 6 అంగన్ వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం పై అవగాహన సమావేశం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో మంచి పౌష్టికాహారం పొందే విధానాన్ని ఆమె వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పిల్లల బరువుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ ఎం వెంకట రమణ, బీ ప్రసన్న, అంగన్ వాడీ ఆయాలు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 12: పురుగుమందు పౌడర్ తాగి వివాహిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన మాచర్ల పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చింతలతండా గ్రామానికి చెందిన కేతావత్ బుల్లి వ్యక్తిగత పనులపై గురువారం మాచర్ల పట్టణానికి వచ్చింది. అప్పటికే ఫోన్‌లో తన భర్తతో ఘర్షణ పడి మనస్థాపం చెందిన బుల్లి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకొని పురుగుమందు పౌడర్ తాగి పడిపోయింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆమె కుమారుడు దేవదాసు నాయక్ పట్టణానికి చేరుకున్నాడు. ఆమె భర్త సంఘీనాయక్ హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుల్లిని మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## పంటకోత ప్రయోగాల నమోదు తప్పనిసరి

క్రోసూరు, సెప్టెంబరు 12 : పంట కోత ప్రయోగాల ద్వారా పంట దిగుబడుల నమోదు తప్పనిసరియని, ఈ విషయంలో అశ్రద్ధ చూపవద్దని క్రోసూరు ఏడీఏ వీ.హనుమంతరావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. గురువారం క్రోసూరులో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పంట కోత ప్రయోగాలు నిర్వాహణ గురించి సమావేశం నిర్వహించారు. పంట కోత ప్రయోగాలు, వాటి నమోదు ద్వారానే పంటల ఉత్పత్తి, ఉత్పాదకతను తెలుస్తుందన్నారు. ఎంపిక చేసిన పొలాన్ని సక్రమంగా నిర్ధారించుకొని పంట కోత ప్రయోగాలను నిర్వహించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వీ.వేణుగోపాల్ పంట కోత ప్రయోగాల నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంటల గణాంక అధికారి ఝాన్సీరాణి వివిధ పంటల్లో కోత ప్రయోగాలు నిర్వహించే పద్ధతిని ప్రయోగాత్మకంగా ప్రదర్శించి చూపించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం

అమరావతి, సెప్టెంబరు 12: మండల పరిధిలోని నరుకుళ్లపాడు వద్ద గల చెరువులో గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వయస్సుగల మహిళ మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. సీఐ శ్రీనివాసరావు ఘటనాస్థలానికి మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన మహిళ సత్తెనపల్లి వెన్నాదేవి కాలనీకి చెందిన మహిళగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయమై సత్తెనపల్లి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించనున్నారని స్థానిక పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేశామని, మహిళ మృతికి గల కారణాలు విచారణలో తేలుతాయని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ అధికారులు

## విద్యుత్, విజిలెన్స్ అధికారుల దాడులు

● రూ 7.34 లక్షల అపరాధ రుసుం విధింపు

బెల్లంకొండ, సెప్టెంబరు 12 : విద్యుత్, విజిలెన్స్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి రూ.7.34 లక్షల అపరాధ రుసుం విధించినట్టు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు హరిబాబు తెలిపారు. గురువారం మండ లంలోని అన్ని గ్రామాల్లో 50మంది విద్యుత్ శాఖ అధికారులు, 155 మంది సిబ్బంది 50 బృందాలుగా విడిపోయి 4,152 సర్వీసులపై తనిఖీలు చేపట్టారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 15 మందికి రూ.15 వేలు అపరాధ రుసుం, మీటరు ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ 1.60 లక్షలు, అనుమతించిన క్యాటగిరి కాక ఇతర క్యాటగిరిలలో విద్యుత్ వాడుకుంటున్న ముగ్గురికి రూ.25 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 116మందికి రూ 5.34 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు కే.సూర్యప్రకాష్, డీఈ కే.రవికుమార్‌లు మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు చేపట్టడం జరిగిందని, రూ.7.34 లక్షల అపరాధ రుసుంను విధించినట్టు ఆయన తెలిపారరు మీటరు లేకుండా నేరుగా విద్యుత్‌ను వినియోగిస్తూంటే వారిపై అపరాధ రుసుంతో పాటు కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో డీఈ బాబ్జినాయక్, ఏఈలు కోటేశ్వరరావు, చంద్ర శేఖర్, పవన్‌కుమార్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



### నివాళి





చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృ మూర్తి నారాయణమ్మ బుధవారం రాత్రి మృతి చెందగా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు గురువారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

- పెదకూరపాడు, పిడుగురాళ్ల



సత్తెనపల్లి గాంధీ బొమ్మ సెంటర్‌లో వినాయకుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు

## గణనాధుడికి ఘనంగా వీడ్కోలు

● కోలాహలంగా నిమజ్జనాలు..

● వివిధ చోట్ల పూజల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 : పట్టణంలోని ఎస్‌బీఐ బజారు, 22వ వార్డు నాగన్నకుంట, 31వవార్డు అంబేద్కర్‌నగర్, గాంధీ బొమ్మ సెంటర్, అచ్చంపేట రోడ్డు కోటమ్మ సత్రం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నాగన్నకుంటలో అన్నదాన కార్యక్రమాన్ని కన్నా ప్రారంభించారు. వేడుకల్లో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, కొల్లిపర కాశీ విశ్వనాథం, బచ్చు కొండలు, పూజల వెంకట కోటయ్య, డాక్టర్ పవన్, పెద్దింటి వెంకటేశ్వర్లు, నూర్ బాషా జానీ బాబు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో వినాయక విగ్రహ ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న యువతీయువకులు

పట్టణంలోని వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు రోజులపాటు పూజలందుకున్న విగ్రహాలను బుధవారం రాత్రి వివిధ మండపాల నిర్వాహకులు ఘనంగా నిమజ్జనం చేశారు. ముందుగా విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో పట్టణంలో ఊరేగించారు. యువత పుర వీధుల్లో నృత్యాలు చేస్తూ డ్రమ్స్ వాయిస్తూ సందడి చేశారు. పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ కాలువలో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేశారు. సీఐలు శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, ఎస్ఐ సంధ్యారాణిలు పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పట్టణంలోని రామాలయం గుడి దగ్గర మండపంలో నిర్వహించిన లడ్డు వేలంలో పట్టణానికి చెందిన గుంటూరు రామారావు రూ.2.65 లక్షలకు దక్కించుకున్నారు. రామారావుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు 27 గ్రాముల బంగారం చైన్‌ను అందించారు.

**మాచర్ల రూరల్ :** మండలంలోని అలుగురాజుపల్లితోపాటు వెల్దుర్తి మండలంలోని గంగలకుంట, శిరిగిరిపాడు గ్రామాల్లో గురువారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన విగ్రహాల ఊరేగింపులో టీడీపీ యువనేత, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నేతలు నేరేటి వీరాస్వామి యాదవ్, రాజభోయిన మధు యాదవ్ పాల్గొన్నారు.

**పెదకూరపాడు:** మండలంలోని గారపాడులో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వినాయక స్వామికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమరావతిలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు తొరటి గోవిందరావు, నలగొండ ఆంజనేయులు, గణేష్ మాధవరావు, మాజీ ఎంపీటీసీలు కొండమీద వెంకటేశ్వర్లు, గోలి యలమందయ్య, కొండమీద గోపీ పాల్గొన్నారు. కంకణాల హనుమంతరావు రూ.25,001కి వేలంలో దక్కించుకున్నారు.

**క్రోసూరు:** క్రోసూరు మెయిన్‌రోడ్డులో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద 36 కేజీల లడ్డుకి వేలం నిర్వహించగా రూ.1,01,116లకు మండల తెలుగు యువత అధ్యక్షుడు కాంద్రు సాంబయ్య దక్కించుకున్నారు. అలాగే అందుకూరులో షేక్ మీరా అనే వ్యక్తి రూ.30 వేలకు వేలంలో లడ్డును దక్కించుకున్నారు. విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, అనంతవరం, దొడ్లేరు గ్రామాల్లో కూడా విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు.

**కారంపూడి:** మండలంలోని ఇనుపరాజుపల్లిలో వినాయకుని విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో బాణాసంచాలు, మేళతాళాలతో టీడీపీ, జనసేన నేతలు భారీ ఊరేగింపు జరిపారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, గోళ్ల సురేష్ యాదవ్, రాజనాల గురవయ్య, నున్న జనార్ధన్, రాజనాల గోపి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### రూ. 2.76 లక్షలు పలికిన గణేష్ లడ్డు

**గురజాలటౌన్:** వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని వీరభద్ర స్వామి గుడి సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. స్వామి వారికి సమర్పించిన లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా రూ. 2.76 లక్షలకు పట్టణానికి చెందిన కాటేపల్లి హరి కృష్ణ సొంతం చేసుకున్నారు.

### గణపతి లడ్డు వేలంలో ముస్లింలు..

**దాచేపల్లి:** మండలం తంగెడ గ్రామంలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహాల వద్ద లడ్డును వేలంలో రూ.66 వేలకు గోగుల వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. అలాగే వివిధ మండపాల వద్ద గణేషుని లడ్డుకి వేలం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముస్లింలు వేలంలో పాల్గొని లడ్డుని దక్కించుకోవడం విశేషం. అనంతరం కృష్ణానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గ్రామానికి చెందిన చింతపల్లి హసన్ అహ్మద్, చికెన్ జానీబాషా, పమ్మి గోవిందరెడ్డి, భూషణం చెన్నయ్య, బత్తుల వెంకటరామిరెడ్డి, మాదినపాటి జాని, నాగరాజు, గోగుల నరసింహా రావు, అన్నవరపు ఆంజనేయులు, పమ్మి పుల్లారెడ్డి, తోట వెంకటరామయ్య, నారాయణ, డాక్టర్ నాగార్జున, మల్లికార్జున, తదితరులు నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



తంగెడ గ్రామంలో లడ్డును దక్కించుకున్న ముస్లింలతో టీడీపీ నేతలు

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

## 15 లోగా ప్రవేశ ఫీజు చెల్లించాలి : డీఈవో



ఎం వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 12: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో 15 తేదీ లోపు ఫీజు చెల్లించవచ్చునని డీఈవో ఎం వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు రూ. 200లు అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చునన్నారు. జిల్లాలో ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ఏఐ కోఆర్డినేటర్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మార్చి 2022 నుంచి మార్చి 2024 వరకు పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన వారిని గుర్తించి, వీరు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్లో చేరే విధంగా కృషి చేయాలన్నారు. 14 సంవత్సరాల వయస్సు నిండి బడి బయట ఉన్న వారు ఓపెన్ స్కూల్లో చేరే విధంగా కృషి చేయాలని జిల్లా సమన్వయకర్త కేఎంఏ హుస్సేన్ సూచించారు.



ఇర్లపాడు ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో సీతారామయ్య

## పోషకాహారంతోనే రక్తహీనతను నివారించవచ్చు

● ఎంపీడీవో సీతారామయ్య

ఇర్లపాడు(శావల్యాపురం), సెప్టెంబరు 12: గర్భిణులు, బాలింతలు, బాలికలు, క్రమం తప్పకుండా పోషకాలున్న ఆహారాన్ని తినడం ద్వారా వారిలో రక్తహీనతను పూర్తి స్థాయిలో నివారించవచ్చని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. పౌష్టికాహార వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పొట్లూరు పంచాయతీ పరిధిలోని ఇర్లపాడు గ్రామంలో పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహారాన్ని తినాలన్నారు. చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లో శరీరానికి కావలసిన పోషకాలు పుష్కలంగా ఉంటాయని, మునగాకును తింటే రక్తహీనతను సులభంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెనిగండ్ల రమాదేవి ఆంజనేయులు, ఏపీవో కటారపు రామారావు, పంచాయతీ కార్యదర్శి కోమటినేని అశోక్‌చౌదరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత, మహిళా పోలీస్ గురవమ్మ, ఏఎన్ఎం భూదేవి, అంగనవాడీ టీచర్‌లు హరిణి, విజయ, అరుణ, హేనాగ్రేస్, ఆశాలు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు

● గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న రామిరెడ్డి, హెచ్ఎం తదితరులు

నాదెండ్ల, సెప్టెంబరు 12: అంకిత భావంతో పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణంశెట్టి వెంకట నాగరాజు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయనకు పాఠశాల ప్రాంగణంలో ఆయనను సత్కరించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుపడినందున కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు వస్తున్నాయన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో కష్టపడి చదవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు వచ్చే పరీక్షలు మైలురాయి వంటివని, మంచి ఫలితాలు సాధించి జిల్లాలోనే పాఠశాలకు గుర్తింపు తేవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుందరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వికాస్ స్కూల్ విద్యార్థులకు జాతీయస్థాయి ర్యాంకులు

చిలకలూరిపేట సెప్టెంబరు 12: జాతీయ స్థాయి గణిత, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలలో స్థానిక వికాస్ స్కూల్ విద్యార్థులు 5, 6, 7 ర్యాంకులు సాధించారు. స్ప్రింగ్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ మేథమెటిక్స్ ఒలింపియాడ్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఒలింపియాడ్ విభాగాల్లో ఈ ర్యాంకులు లభించాయి. జాతీయ స్థాయిలో 2 లక్షల13 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. ర్యాంకులు పొందిన వారిలో మన్విత (7వ ర్యాంక్). సానియా(5 వ ర్యాంక్), తుషార(6వ ర్యాంక్) సాహితీ చౌదరి(7వ ర్యాంక్) గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందిస్తూ వికాస్ స్కూల్ డైరెక్టర్లు దండా పవన్‌కుమార్, దండా రోజశ్రీ గోల్డ్ మెడల్స్ సర్టిఫికెట్స్ గురువారం అందచేశారు. ప్రిన్సిపాల్ శ్యాంబాబు పాల్గొన్నారు.

## ఇంటి ముందు పెట్టిన ఆటో అపహరణ

శావల్యాపురం, సెప్టెంబరు 12: ఇంటిముందు పెట్టిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శావల్యాపురంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన దూదేకుల పెదసైదా గుంటూరు- కర్నూలు జాతీయ రహదారి సమీపంలో ఉన్న బజారులోని తన ఇంటి ముందు ఆటోను ఉంచాడు. బుధవారం రాత్రి గ్రామంలో వినాయక విగ్రహం నిమజ్జనం ఉండడంతో రాత్రి 12గంటల వరకు గ్రామస్థులు తిరుగుతూనే ఉన్నారు. అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు పెదసైదా ఆటోను తీసుకుని వెళ్లారు. ఉదయాన్నే ఇంటి బయటకు వచ్చిన సైదాకు ఇంటి ముందు పెట్టిన ఆటో కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారిని ఆరా తీశాడు. ఆచూకీ తెలియకపోవడంతో ఆటో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## బంగారం గొలుసు చోరీ

వినుకొండటౌన్, సెప్టెంబరు 12: ఇంటి ముందు అరుగుపై కూర్చున్న మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రంపై వచ్చి బంగారం గొలుసు అపహరించిన ఘటన పట్టణంలోని విష్ణుకుండీ నగర్‌లో గురువారం రాత్రి జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. విష్ణుకుండీనగర్‌కు చెందిన దావలూరి నాగవాణికి ఇంటి ముందు కూర్చొని ఉండగా ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తులు తెలియని వ్యక్తులు 6 సవర్ల బంగారం గొలుసుని లాక్కొని పరారైనట్లు తెలిపారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు.



## చేనేత సహకార సంఘాలకు పూర్వ వైభవం

● పాలక వర్గాల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
● అధికారుల కమిటీలతో చేతులు దులుపుకున్న గత వైసీపీ ప్రభుత్వం



ఫణిదం చేనేత సహకార సంఘంలో పని చేస్తున్న మహిళా నేత కార్మికులు

సత్తెనపల్లి, సెప్టెంబరు 12: చేనేత రంగానికి పూర్వ వైభవం రానుంది. సహకార సంఘాల బలోపేతానికి అడుగులు పడుతున్నాయి. సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించటంతో చేనేత శాఖ చర్యలు చేపట్టింది. పల్నాడు జిల్లాలో సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట, మాచవరం, కొత్తపల్లి సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సహకార సంఘాల పరిధిలో చేనేత కార్మికులు ఉపాధిని పొందుతున్నారు. ముడి సరుకుల ధరల పెరుగుదల, గిట్టుబాటు కాని అమ్మకాలు, కూలీ తదితరాలతో చేనేత రంగం ఆ ప్రభావాన్ని కోల్పోతుంది. ఎక్కువ మంది వృత్తిని వదిలివేసి ప్రత్యామ్నాయ పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. గత ప్రభుత్వ నిర్వాహకంతో చేనేత రంగం నిర్వీర్యమైంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా అధికారుల కమిటీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. నిధులు విడుదల చేయకపోవటం సంఘాలు నిర్వీర్యమయ్యాయి.

కూటమి ప్రభుత్వం చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టింది. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 21 నుంచి ప్రక్రియ మొదలై డిసెంబరు 6న పాలక వర్గాలు కొలువు దీరేలా ఆదేశాలు జారీ చేసింది. ఒక్కొక్క సంఘానికి తొమ్మిది మంది సభ్యులతో పాలకవర్గాన్ని ఎన్నుకోనున్నారు. వారిలో ఇద్దరు మహిళలు ఉండాలి. ఈ ఎన్నికలతో సంఘాల్లో పని చేసే కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నామని, ఇది చేనేత రంగానికి ఎంతో ఉపయోగమని ఫణిదం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు తెలిపారు. 2014 -19 మధ్య ఎలాంటి లబ్ది చేకూరిందో అదే స్థాయిలో పథకాలను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఆప్కో వ్యవస్థను పునరుద్ధరించి నియోజవర్గ కేంద్రాల్లో వస్త్రాలను విక్రయించే సదుపాయం, సొసైటీల వద్ద వర్క్ షెడ్ల నిర్మాణాలకు ప్రత్యేక రుణాలు, ఉచిత విద్యుత్, బీమాతో పాటు వర్షాకాలంలో ఆదుకొనేందుకు పరిహా రం, పరపతి రుణాలు, కేంద్ర ప్రభుత్వ రాయితీలు ప్రభుత్వం కల్పిస్తుం దనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## గతంలో ఆపేసిన పథకాలు ప్రారంభించేందుకు ప్రయత్నం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేస్తున్న మాల మహానాడు, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ నాయకులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 12: గతంలో ఆపేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు మొత్తం తిరిగి ప్రారంభించే విధంగా ప్రభుత్వం చూస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అదవిందబాబు అన్నారు, గురువారం నరసరావుపేట పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెడుతున్న 2024-25 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ కింద వివిధ పథకాల కోసం నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, కలెక్టర్ పీ అరుణ్‌బాబుకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలు రూపొందిస్తామని, ఎస్సీ కార్పొరేషన్‌లో ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాలు తిరిగి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఇచ్చినటువంటి ఎస్సీ, ఎస్టీ ప్రతిపాదనలపై వచ్చే బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడతామని అన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ అంబేడ్కర్ విదేశీ విద్యావిధాన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ పిల్లలను ఎక్కువ మందిని విదేశీ చదువులకు పంపించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులకు విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ రిసెర్చ్ స్కాలర్స్‌కి ఉపకార వేతనం పథకాన్ని ప్రవేశపెట్టి కనీసం నెలకి రూ.30 వేలు, అంబేడ్కర్ రీసెర్చ్ ఫెలోషిప్ పేరుతో ఇవ్వాలని కోరారు. అందుకోసం ఈ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడాలని, ఆంధ్రప్రదేశ్ సాంఘీక, సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియేట్ ప్రవేశాల కోసం 12 వేల సీట్లు అందుబాటులో ఉండగా సుమారు 39 వేల దరఖాస్తులు ప్రతి సంవత్సరం వస్తున్నాయని, 27 వేల మంది గురుకులాల్లో చదుకునే అవకాశం ప్రతి సంవత్సరం కోల్పోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం 20 కొత్త గురుకుల పాఠశాలలను నిర్మించి, అందుకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్ సమావేశాల్లో రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పుస్తెల జయరావు, కుంభా బ్రహ్మయ్య, వీరాంజనేయులు, మేడే వెంకటరమణ, గుండాల మాణిక్యరావు, తోకల సాంబయ్య, గడ్డిపతి కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వినాయక ఉత్సవాలు



సీతయ్య నగర్‌లోని 13 అడుగుల వినాయక విగ్రహం

వినుకొండ, సెప్టెంబరు 12: పట్టణంలోని నరసరావుపేటరోడ్డు, మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 22 అడుగుల భారీ అభయ విగ్నేశ్వర విగ్రహాన్ని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సందర్శించి, పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు సురేష్‌ను జీవీ అభినందించారు. మండపం వద్ద సుమారు 1.50 లక్షలతో ఏర్పాటు చేసి పాటకచేరి కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. పట్టణంలోని ప్యాన్సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాథున్ని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీరించారు. పట్టణంలోని సీతయ్య నగర్ లో 13 అడుగడుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆరో రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విశ్వసాయి జూనియర్ కళాశాల్లో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో శివశక్తి లీలా ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి పాల్గొని తన జీవితంలో స్వానుభవంతో నేర్చుకున్న జీవన సత్యాలను విద్యార్థులకు బోధించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించి పలు సాంస్కృతిక కార్యక్రమాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావనీ, బ్రహ్మణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంత్రిరాజు సత్యనారాయణ, విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, పువ్వాడ కృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### లక్షాయాభై వేలు పలికిన లడ్డు



రూ 1.50 వేలకు లడ్డూను దక్కించుకున్న టీడీపీ మాజీ సర్పంచి యర్రంరెడ్డి అంజిరెడ్డి, డోకిపర్తి బాలాజి

వినుకొండ, సెప్టెంబరు 12: మండలంలోని నరగాయపాలెంలో వినాయక ఉత్సవాల్లో స్వామి వారి లడ్డును అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచి యర్రంరెడ్డి అంజిరెడ్డి, డోకిపర్తి బాలాజిలు కలిసి లక్షా 50 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన లడ్డు వేలం పాటల్లో 1.50 వేలు పలకడం, వినుకొండలో ఇదే ప్రథమం అని పట్టణ, నరగాయపాలెం గ్రామస్తులు తెలిపారు.

### రొంపిచర్లలో కోలాహలంగా నిమజ్జనోత్సవాలు

రొంపిచర్ల, సెప్టెంబరు 12: రొంపిచర్లలోని పడమటిపాలెంలో వినాయక నిమజ్జనోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వినాయకుని వద్ద ఉంచిన లడ్డును గోపు ఆదెయ్య రూ.57వేలకు, మరొక లడ్డును జుజ్జూరి రత్తమ్మ రూ.20వేలకు వేలంలో దక్కించుకున్నారు. తులసికోట, రామాలయం, బోసు బొమ్మసెంటర్, దేవుడుమాన్యం కాలనీ, బొడ్రాయి సెంటర్, చౌడేశ్వరి గుడి బజారులో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్ర హాలు పూజలు అందుకుంటున్నాయి. తులసీ కోట వద్ద భక్తి గీతాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండపాలకు విద్యుత్ దీపా లంకరణ చేశారు. ఎస్ఐ అశోక్ బందోబస్తు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## వరద బాధితులకు శాంతినిలయం, పాస్టర్స్ ఫెలోషిప్ సాయం



సిద్ధం చేసిన సరుకులు లారీలో పంపుతున్న చిత్రం

చిలకలూరిపేట సెప్టెంబరు 12: విజయవాడలో వరద బాధిత కుటుంబాల కు సహాయం నిమిత్తం రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ అడిషనల్ సెక్రటరీ, పల్నాడు జిల్లా అధ్యక్షుడు నందమూరి క్రిస్టఫర్ ఆధ్వర్యంలో గురువారం సహాయం అందించారు. చిలకలూరిపేట దివ్య శాంతి నిలయం, ఆంధ్రప్రదేశ్‌స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ (పల్నాడు జిల్లా) వారి ద్వారా సహాయాన్ని సుమారు మూడున్నర టన్నులకు పైగా కూరగాయలు, పదివేల లీటర్ల వాటర్ కాన్స్ పంపిణీ చేశారు. ఈ సహాయక కార్యక్రమాల కోసం ఆర్థిక సాయం చేసిన శాంతినిలయం సంఘం పాస్టర్ టి.రత్నకుమార్ (క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్), పాస్టర్ బండా రు ప్రసన్నకుమార్ (తెలుగు బాప్టిస్ట్ చర్చ్) వారికి, సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న చిలకలూరిపేట యూత్‌కు క్రిస్టఫర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సహాయ కార్యక్రమాల్లో అఖిల్ ఆడమ్స్ ( రాఫా మినిస్ట్రీస్, గుంటూరు), జె. చక్రవర్తి (క్రాస్ సోల్జర్స్, మర్రిపాలెం), విజయవాడకు చెందిన పాస్టర్ దాని యేలు, పాస్టర్ ఎలీషా, పాస్టర్ లూథర్ పాల్, పాస్టర్ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

● ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధరబాబు

దుర్గి, సెప్టెంబరు 12: ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధరబాబు కోరారు. గురువారం మండలంలోని ముటుకూరు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎస్టీయూ సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా గంగాధర బాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను విద్యావ లంటీర్ల ద్వారానైనా భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ దుర్గి మండల అధ్యక్షుడు నబి సాహెబ్, కార్యదర్శి కటకం అపర్ణ, భారతి, ఎర్రం ఏడుకొండలు, బూసాని శ్రీనివాసరావు, అనంతరామయ్య, బొమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 12: పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి నందిపాటి శ్రీనివాసరెడ్డి గురువారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. రైతులకు ఎరువులు అమ్మిన వెంటనే ఈ-పాస్ తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలియ జేశారు. కార్యక్రమలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వరదలపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

సత్తెనపల్లి, సెప్టెంబరు 12 : వరదలపై వైఎస్ జగన్ బురద వ్యాఖ్యలు సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. వరద బాధితులకు అండగా నిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషిని దేశం మొత్తం చూస్తుందన్నారు. వైఎస్ జగన్ మాత్రం మొక్కుబడిగా పర్యటించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడంతో సరిపుచ్చుకున్నారని వందనాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు.



## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, గ్రామస్థులు

నాదెండ్ల, సెప్టెంబరు 12: మండలంలోని సాతులూరు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గురువారం పరిశీలించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల కోరిక మేరకు ఆయన సుమారు రూ.20 లక్షల ఆర్థిక సంఘం నిధులతో జరుగుతున్న మురుగు కాలువల నిర్మాణం తదితర పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గుంటూరు - కర్నూలు రహదారి నుంచి రైల్వేస్టేషన్ వరకు రహదారి అభివృద్ధి కోసం అధికారులు తయారు చేసిన అంచనాలను ఎంపీకి అందజేశారు. గ్రామంలోని వడ్డెర బీసీ కాలనీలో సమ్మిట్ హాల్ నిర్మాణానికి నిధులివ్వాలని వినతిపత్రాన్ని అందించారు.

## వామపక్షాలు పెద్ద దిక్కుని కోల్పోయాయి

● సీతారాం ఏచూరికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సంతాపం

వినుకొండ, సెప్టెంబరు 12: కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంతో వామపక్షాలు పెద్ద దిక్కుని కోల్పోయాయని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రాజకీయాలకు కూడా ఈ లోటు తీరనిదని అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఢిల్లీ ఎయిమ్స్‌లో కన్నుమూశారని, ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో అరుదుగా ఉంటారని, రాజకీయాల్లో ఎంతోమందికి ఆయన ఆదర్శమని కొనియాడారు.

### ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం

చిలకలూరిపేట సెప్టెంబరు 12: ఆధునిక భారతదేశ జాతీయ రాజకీయాల్లోనే అజాతశత్రువు సీతారాం ఏచూరి అని, అలాంటి వ్యక్తి మరణం దేశానికి తీరని లోటు అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. ఏచూరి మృతికి ఆయన సంతాపం ప్రకటించారు. వారి పోరాటాలు, సాధించిన విజయాలు, ఆచరించిన సిద్ధాంతాలు, పాటించిన విలువలు గుర్తుండిపోతాయని అన్నారు.

## వినియోగదారులకు సకాలంలో సేవలు అందించాలి

● విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు

రొంపిచర్ల, సెప్టెంబరు 12 : విద్యుత్ వినియోగదారులకు సకాలంలో సేవలు అందించాలని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రొంపిచర్లలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో రొంపిచర్ల, నకరికల్లు, శావల్యాపురం, ఈపూరు మండలాల ఏఈలు, విద్యుత్ రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరుశాతం విద్యుత్ బిల్లులు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎకౌంట్ అధికారి రామిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

● రూ.3.26 లక్షల జరిమానా విధింపు

నాదెండ్ల, సెప్టెంబరు 12: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనధికారికంగా, అధిక లోడు విద్యుత్ వినియోగం చేస్తున్న 60 సర్వీసులకు రూ.2.26 లక్షలు, నాలుగు సర్వీసులకు గాను అపరాధ రుసుం లక్ష రూపాయలు జరిమానాగా విధించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దాడుల్లో డీఈఈ ఏ గుర్నాథరావు, పది మంది ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్, ఏఈ పీవీఎన్ ప్రసాదులు తెలిపారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు



నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

రొంపిచర్ల, సెప్టెంబరు 12 : మండలంలోని సంతగుడిపాడు జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉత్త మ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను గురువారం అందజేశారు. గత సంవత్సరంలో ఆరు నుంచి 10వ తరగతి వరకు నిర్వహించిన పరీక్షల్లో అత్యధిక మార్కు లు సాధించిన వారికి ఈ నగదు పురస్కారాలను అందజేశా రు. ఐదు జడ్పీ పాఠశాలల్లో క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి, స్పోర్ట్స్‌లో విజయం సాధించిన వారికి నగదు పురస్కా రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్రోసూరు సుబ్బారావు, క్రోసూరు నాగేశ్వరరావు, డాక్టర్ నల బోతు వెంకటరావు, బొట్ల భూదెయ్య, డాక్టర్ ముప్పాళ్ళ రాధా కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## శ్రీదత్త వైద్యశాలలో డీఎంహెచ్‌వో రవి తనిఖీలు

వినుకొండటౌన్, సెప్టెంబరు 12: వినుకొండ ఏనుగుపాలెం సెంటర్‌లోని డైమాండ్ టవర్ ఆవరణలోని శ్రీదత్తా వైద్యశాలను పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో రవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు గంటసేపు వైద్యశాలలోని వార్డులు, ల్యాబ్, మిషనరీని పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందికి సంబంధించి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైద్యశాలకు తాత్కాలిక అనుమతులిచ్చామని, వైద్యశాలను పర్మినెంట్ అనుమతుల కోసం పరిశీలించినట్లు తెలిపారు. వినుకొండలో బాలాజీ, తిరుమల వైద్యశాల్లోని స్కానింగ్ సెంటర్ల పరిశీలించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 190 వరకు ప్రైవేట్ వైద్యశాలలు ఉన్నాయని, వాటిలో కొన్నింటిని పరిశీలించి రెన్యువల్ చేయాల్సి ఉందని తెలిపారు. అధిక ఫీలుజు వసూళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామని, అవసరమైన మేరకే టెస్టులు నిర్వహించి రోగులకు వైద్యం అందేవిదంగా చూస్తామని తెలిపారు.

## సీపీఐ సీనియర్ నేత కోటయ్య మృతికి సంతాపం

మతుకుమల్లి(శావల్యాపురం), సెప్టెంబరు 12: మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన కమ్యూనిస్టుపార్టీ సీనియర్ నాయకులు ముంద్రు కోటయ్య అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. సీపీఐ ఏరియా సమితి సభ్యులు అరుణ, వినుకొండ నియోజకవర్గ సీపీఐ ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు పాల్గొని కోటయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఐ సీనియర్ నాయకుడిగా కోటయ్య పేదల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశాడని, రైతుసంఘం నాయకుడిగా అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. కోటయ్య మృతదేహానికి మాజీ సర్పంచులు ముంద్రు హనుమంతరావు, బత్తుల వెంకటేశ్వర్లు, సీపీఐ నేతలు బూదాల చిన్న, కిషోర్, మస్తాన్, రాయబారం వందనం, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, సోడాల సాంబయ్య, హనుమాన్‌సింగ్, బాలాజీసింగ్ తదితరులు నివాళులర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రొంపిచర్ల, సెప్టెంబరు 12: మండలంలోని తురుమెళ్ళ జంక్షన్ వద్ద గురువారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగరాజుపల్లి తండాకు చెందిన ఇరువురు ద్విచక్ర వాహనంపై సంతమాగులూరు అడ్డరోడ్డు వైపు వెళ్తున్నారు. హైదరాబాద్ వైపుకు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరి కాళ్ళకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తర లించారు. గాయాలైన వారిని అంబులెన్స్‌లో నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు.